# హుజూరాబాద్ రాజకీయాల్లో కొత్త చర్చ..
# ఉపఎన్నిక వస్తే బీజేపీ నుంచి సబ్బని వెంకట్ పోటీ?

**– 2028 ఎన్నికలే లక్ష్యంగా భావించిన నేత.. కౌశిక్ రెడ్డి వ్యవహారాలతో ముందుగానే బరిలోకి దిగే ఆలోచన?**

**– 2023 లో ఈటెల రాజేందర్ కోసం తప్పుకున్న వెంకట్ , 2024 ఎంఎల్సీ అవకాశం కూడా వదులుకున్నందుకు , మద్దతు ఇచ్చినందుకు బీజేపీ ఆఫర్ ?**

హుజూరాబాద్ అక్టోబర్ 14 (వాయిస్ టుడే) : హుజూరాబాద్ రాజకీయాల్లో మరో ఆసక్తికరమైన పరిణామంపై చర్చ జరుగుతోంది. బీజేపీ నాయకుడిగా సబ్బని వెంకట్ వచ్చే అసెంబ్లీ ఉపఎన్నికలో పోటీ చేసే అవకాశాలపై రాజకీయ వర్గాల్లో ఊహాగానాలు వినిపిస్తున్నాయి. ఇప్పటివరకు 2028 సాధారణ అసెంబ్లీ ఎన్నికలను లక్ష్యంగా పెట్టుకున్నారని భావించిన ఆయన, ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఉపఎన్నిక వస్తే ముందుగానే బరిలోకి దిగే ఆలోచనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది.

### కౌశిక్ రెడ్డి వ్యవహారాలతో మారుతున్న రాజకీయ సమీకరణాలు?

హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి చుట్టూ



కొనసాగుతున్న రాజకీయ వివాదాలు నియోజకవర్గ రాజకీయాల్లో చర్చనీయాంశంగా మారాయి. అసెంబ్లీలో జరిగిన పరిణామాలపై ఆయనకు సంబంధించిన వ్యవహారాన్ని ఎథిక్స్ కమిటీ పరిశీలిస్తున్నట్లు వార్తలు వెలువడ్డాయి. అయితే, ఈ పరిణామాలు ఉపఎన్నికకు దారితీస్తాయా లేదా అనేది అధికారిక నిర్ణయాలపై ఆధారపడి ఉంటుంది. ఈ నేపథ్యంలో ఉపఎన్నిక జరిగితే తన రాజకీయ బలాన్ని నిరూపించుకోవడానికి సబ్బని వెంకట్ సిద్ధమవుతున్నారనే ప్రచారం స్థానిక రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

### బీజేపీ అధిష్ఠానంతో సంప్రదింపులు?

సబ్బని వెంకట్ ఇప్పటికే బీజేపీ అధిష్ఠానాన్ని కలిసి తన రాజకీయ భవిష్యత్తు, హుజూరాబాద్‌లో పార్టీ అవకాశాలు, ఉపఎన్నికలో పోటీ చేసే అంశాలపై చర్చించినట్లు వినికిడి. అయితే ఈ భేటీ జరిగినట్లు అధికారిక ధృవీకరణ అందుబాటులో లేదు. పార్టీ నుంచి కూడా ఆయన అభ్యర్థిత్వంపై ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

### 2028 లక్ష్యం.. ఉపఎన్నికతో ముందస్తు రాజకీయ పరీక్ష?

2028 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాలనే లక్ష్యంతో రాజకీయంగా ముందుకు సాగుతున్నారని భావించిన సబ్బని వెంకట్‌కు, ఉపఎన్నిక జరిగితే అది ముందస్తు రాజకీయ పరీక్షగా మారవచ్చనే విశ్లేషణ వినిపిస్తోంది. ఉపఎన్నిక ద్వారా ప్రజల్లో తనకున్న మద్దతును అంచనా వేసుకోవడంతో పాటు, నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసే అవకాశం కూడా ఉంటుందని రాజకీయ పరిశీలకులు భావించవచ్చు.

### ఉపఎన్నిక వస్తే పోటీ ఖాయమా?

ప్రస్తుతానికి హుజూరాబాద్ ఉపఎన్నికపై తుది నిర్ణయం వెలువడలేదు. సబ్బని వెంకట్ బీజేపీ అభ్యర్థిగా బరిలోకి దిగుతారా లేదా అన్నది కూడా స్పష్టం కాలేదు. అయితే ఉపఎన్నిక జరిగితే పోటీకి సిద్ధమయ్యే అవకాశంపై సాగుతున్న చర్చ హుజూరాబాద్ రాజకీయాల్లో కొత్త ఆసక్తిని రేకెత్తిస్తోంది.

## మహాచండీ దేవిగా భక్తులకు దర్శనమిచ్చిన అమ్మవారు

**మహాశక్తి ఆలయంలో పసుపు కొమ్ములతో చండీదేవి అలంకరణ**

**ప్రత్యేక పూజలు నిర్వహించిన కేంద్ర మంత్రి బండి సంజయ్**

**శుక్రవారం సరస్వతి మాత పూజ**



కరీంనగర్,అక్టోబర్ 14(వాయిస్ టుడే):దసరా నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కరీంనగర్ శ్రీ మహాశక్తి ఆలయంలో మహాచండీ దేవి(కుష్మాండ) అవతారంలో భక్తులకు దర్శన మిచ్చారు. అలయ నిర్వాహకులు అమ్మవారిని పసుపు కుంకుమలతో అలంకరించారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ మహాచండీ దేవిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.దసరా నవరాత్రి ఉత్సవాల్లో చండీదేవి అవతారానికి విశేష ఆధ్యాత్మిక ప్రాధాన్యం ఉంది. ఆదిశక్తి స్వరూపిణిగా పూజలందుకునే చండీదేవి దుష్టశక్తులను సంహరించి ధర్మాన్ని కాపాడే శక్తికి ప్రతీకగా నిలుస్తోంది. దేవీ మహాత్మ్యం ప్రకారం, మహిషాసురుడు,శుంభనిశుంభులు వంటి రాక్షసులను సంహరించిన జగన్మాత పరాక్రమం అమ్మవారి శక్తిసామర్థ్యాలను చాటిచెబుతుంది. ఆయుధధారిణిగా,సింహవాహనంపై కొలువుదీరిన చండీదేవి రూపం ధైర్యం,సాహసం,విజయానికి ప్రతీక.చండీదేవిని ఆరాధించడం వల్ల భయం తొలగి,ఆత్మవిశ్వాసం పెరిగి,జీవితంలోని అడ్డంకులను అధిగమించే శక్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం.చెడుపై మంచి,అధర్మంపై ధర్మం సాధించే విజయానికి చండీదేవి అవతారం ప్రతీకగా నిలుస్తుంది.శుక్రవారం రాత్రి 9 గంటలకు నిర్వహించే దాండియాలో పాల్గొనే భక్తులంతా రెడ్ కలర్ డ్రెస్ కోడ్ తో రావాలని ఆలయ నిర్వహకులు విజ్ఞప్తి చేశారు.



## 50 మంది బాలింతలకు బేబీ కిట్ల పంపిణ

ఖమ్మం: జిల్లా సంక్షేమ అధికారి పాలేటి ప్రమీలా గారి ఆధ్వర్యంలో బేటీ బచావో – బేటీ పడావో కార్యక్రమంలో 50 బాలింతలకు బేబీ కిట్లను పంపిణీ చేశారు. ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని మాతా శిశు కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) డాక్టర్ శ్రీజా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కిట్లలో చిన్నారులకు అవసరమైన దుస్తులు, టవల్స్, ఇతర వస్తువులు ఉన్నాయి. ఆడపిల్లల జననాన్ని గౌరవిస్తూ, వారి పట్ల సమాజంలో సానుకూల దృక్పథాన్ని పెంపొందించడం, బాలికల సంరక్షణ, విద్య, ఆరోగ్యం, సాధికారతపై ప్రజల్లో అవగాహన కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ రామారావు, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్, జిల్లా మహిళా సాధికారత కేంద్రం కోఆర్డినేటర్ ఎస్.డి. సమ్రీన్, జెండర్ స్పెషలిస్టులు పి. ప్రమీలా, ఆర్. వాసంతి, ఎస్ఎఫ్ఎల్ కె. సతీష్, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ కొమినేని బాబు, జిల్లా సంక్షేమ అధికారి కార్యాలయ సూపరింటెండెంట్ ఎన్. ముత్తయ్య పాల్గొన్నారు.

## సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని సీఆర్పీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ ఆత్మహత్య



చర్ల: ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా మెట్టగూడెం క్యాంపులో విధులు నిర్వహిస్తున్న ఒక సీఆర్పీఎఫ్ సబ్-ఇన్‌స్పెక్టర్ తన సర్వీస్ రివాల్వర్‌తో కాల్చుకొని ఆత్మహత్యకు పాల్పడ్డారు. మంగళవారం అర్ధరాత్రి క్యాంపులో (131వ బెటాలియన్, సీఆర్పీఎఫ్) విధులు నిర్వహిస్తున్న సబ్-ఇన్‌స్పెక్టర్ దేవానంద్ యాదవ్ ఉన్నట్టుండి తన సర్వీస్ రివాల్వర్‌తో తనను తాను కాల్చుకున్నారు. రివాల్వర్ శబ్దం విన్న క్యాంపులోని తోటి జవాన్లు, అధికారులు వచ్చి చూడగా దేవానంద్ రక్తపుమడుగులో ఉన్నారు. వెంటనే అతడ్ని చికిత్స నిమిత్తం ఫీల్డ్ అంబులెన్స్‌లో ఇల్మగూడ క్యాంపుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆయన మృతి చెందారు. ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని ఆయన స్వగ్రామానికి పంపేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది.



## అమ్మవారి మండపంలో వైభవంగా అమ్మవారి కుంకుమార్చన

చిన్నకోడూర్ అక్టోబర్ 14 (వాయిస్ టుడే): చిన్నకోడూర్ మండలం ఇబ్రహీంనగర్ దేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి అమ్మవారికి కుంకుమార్చన కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమార్చన చేసి, గ్రామ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలతో సుఖసంతోషాలతో ఉండాలని, గ్రామం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు. అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలని, ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, ఐశ్వర్యం వెల్లివిరియాలని భక్తులు కోరుకున్నారు. ఇబ్రహీంనగర్ దేవి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ మహిళలు భక్తిపూర్వకంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి నామస్మరణతో కార్యక్రమం ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగింది. ఈ కార్యక్రమం ద్వారా గ్రామంలో భక్తిభావం, ఐక్యత, ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరిశాయి.



## శరన్నవరాత్రోత్సవాలు కూష్మాండ అలంకారంలో అమ్మవారి దర్శనం

వేములవాడ, అక్టోబర్ 14 (వాయిస్ టుడే): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శరన్నవరాత్రోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 4వ రోజైన బుధవారం అమ్మవారు భక్తులకు "కూష్మాండ అలంకారం" లో దర్శనమిచ్చి తరింపజేశారు.ప్రధానాలయం లో శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి పూజా కార్యక్రమాలను ఆలయ అర్చకులు, వేద పండితులు ఏకాంతంగా, శాస్త్రోక్తంగా నిర్వహించారు. అదే సమయంలో భక్తుల సౌకర్యార్థం అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలోని మండపంలో అమ్మవారి ప్రత్యేక దర్శనాలు,పూజా కార్యక్రమాలను అంగ రంగ వైభవంగా ఏర్పాటు చేశారు. వేద మంత్రో చ్చారణలు, మంగళ వాయిద్యాల శృతుల నడుమ అర్చకులు ఈ వేడుకలను ప్రారంభించారు.ఈ వేడుకల్లో ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు, ఆలయ సిబ్బందితో పాటు పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారల, అమ్మవారి కృపకు పాత్రులయ్యారు.

## తాలిపేరు నదిలో యువకుడు గల్లంతు



చర్ల: మండలంలోని తేగడ సమీపంలో ఉన్న తాలిపేరు నదిలో బుధవారం ఓ ఇంటర్ విద్యార్థి గల్లంతయ్యాడు. దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కొందరు దేవి మాలలు వేసుకున్నారు. మాలధారులతో కలిసి తేగడ సమీపంలోని తాలిపేరు నదికి వెళ్లిన దగ్గుపల్లి బాబి అనే యువకుడు ప్రమాదవశాత్తు నదిలో మునిగి గల్లంతయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని, యువకుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. యువకుడు మునిగిగొల్లకట్ట(చర్ల)కు చెందిన వ్యక్తిగా గుర్తించారు.



## కార్పొరేట్ పాఠశాలల్లో ఆస్ట్రేలియన్,కేంబ్రిడ్జ్ కరికులాల పేరుతో అదనపు ఫీజుల దోపిడీని అరికట్టాలి

**విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు చేపట్టాలి**

**బీసీ సంఘాల నాయకుల డిమాండ్**

కరీంనగర్,అక్టోబర్ 14(వాయిస్ టుడే): జిల్లాలోని కార్పొరేట్, ప్రైవేట్ పాఠశాలల్లో విదేశీ కరికులం(ఆస్ట్రేలియన్,కేంబ్రిడ్జ్) పేరుతో తల్లిదండ్రులపై అదనపు ఫీజుల భారం మోపే ప్రయత్నాలను అరికట్టాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.ఈ మేరకు జిల్లా విద్యాధికారిని కలిసి ప్రైవేట్ పాఠశాలల్లో అధిక ఫీజుల వసూళ్లను నియంత్రించాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా బీసీ సంఘాల నాయకులు మాట్లాడుతూ ఇప్పటికే వరల్డ్ స్కూల్,ఇంటర్నేషనల్ స్కూల్, హెరిటేజ్ స్కూల్,ఈ-టెక్నో స్కూల్ వంటి పేర్లతో కొన్ని విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలు ఉన్నాయని పేర్కొన్నారు.ఇప్పుడు కేంబ్రిడ్జ్,ఆస్ట్రేలియన్ కరికులం పేరుతో కొత్త విధానాలను ప్రవేశపెట్టి,విద్యను మరింత ఖరీదైనదిగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.విద్య అనేది ప్రతి బిడ్డకు అందాల్సిన హక్కు అని, దానిని కేవలం వ్యాపారంగా మార్చడం తగదని వారు స్పష్టం చేశారు.ఇప్పటికే అధిక ఫీజుల కారణంగా పేద,మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కొత్త కరికులం పేరుతో అదనపు ఫీజులు వసూలు చేస్తే వారి పరిస్థితి మరింత దయనీయంగా మారుతుందని అన్నారు.విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఆటలు,క్రీడలు, విశాలమైన వాతావరణం ఎంతో అవసరమని, అలాంటి కనీస సదుపాయాలు కల్పించకుండా అధిక ఫీజులు వసూలు చేస్తున్నారనే ఫిర్యాదులను అధికారులు పరిశీలించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో బీసీ జేఏసీ నాయకులు కేశిపెద్ది శ్రీధర్ రాజు,రాచమల్ల రాజు,దొగ్గలి శ్రీధర్,పెంట శ్రీనివాస్,మియాపురం రవీంద్ర చారి పాల్గొన్నారు.



## వేములవాడలో సద్దుల సంబరం కలెక్టర్, ఎస్పీ, ఆహ్వానం

ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ: తరతరాల ఆనవాయితీ.

శుక్రవారం మూలవాగు తెప్ప వద్ద బతుకమ్మ వేడుకలు.



వేములవాడ, అక్టోబర్ 14 (వాయిస్ టుడే): వేములవాడ పట్టణం లో శుక్రవారం సాయంత్రం మూలవాగు బతుకమ్మ తెప్ప వద్ద అత్యంత వైభవంగా నిర్వహించ నున్న సద్దుల బతుకమ్మ వేడుకలకు విచ్చేయా ల్సిందిగా రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్ గరిమ అగర్వాల్, జిల్లా ఎస్పీ మహేష్ బి గీతే, అడిషనల్ కలెక్టర్ నగేష్, కి కలెక్టరేట్ లో పట్టణ మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ కమిషనర్ లోకేష్ లతో కలసి మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు మర్యాద పూర్వకంగా కలసి ఆహ్వాన పత్రాలు అందజేశారు.రాష్ట్ర వ్యాప్తంగా తొమ్మిది రోజుల పాటు బతుకమ్మ పండుగ సంబరాలు సాగడం ఆనవాయితీ కాగా, రాజరాజేశ్వర స్వామి వారి పుణ్యక్షేత్ర మైన వేములవాడలో మాత్రం ఏడు రోజులకే సద్దుల బతుకమ్మ వేడుక ను జరుపుకోవడం ఇక్కడి తరతరాల ఆధ్యాత్మిక విశిష్టత అని ఈ సందర్భంగా కలెక్టర్ కు చైర్మన్ వివరించారు. మూలవాగు వద్ద జరిగే పూల సంబరాలకు వేలాది మంది భక్తులు, మహిళలు విచ్చేసే అవకాశం ఉండటంతో వారికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, విద్యుత్ దీపాలు, పారిశుధ్య నిర్వహణతో పాటు పటిష్టమైన భద్రతా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ఆహ్వాన కార్యక్రమం లో మున్సిపల్ వైస్ చైర్మన్ నరాల శేఖర్, కమిషనర్ లోకేష్ లతో పాటు కౌన్సిలర్లు అన్నారం శ్రీనివాస్, కొక్కుల బాలకృష్ణ, ఏల శ్రీనివాస్, తోటరాజు, కొండ రాజశేఖర్, సంతోష కరుణాకర్, రామతీర్థపు కృష్ణవేణి హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## జై భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి పల్లకి సేవ

ఆసిఫ్ నగర్,అక్టోబర్ 14(వాయిస్ టుడే): శరన్నవరాత్రి ఉత్సవాలు ఊరు వాడ ఘనంగా నిర్వహిస్తున్నారు.కొత్తపల్లి మండలం ఆసిఫ్ నగర్ (బావుపేట) గ్రామంలో జై భవానీ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో దుర్గాదేవి పల్లకి సేవ ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు,భవానీ మాలధారులు, అమ్మవారి భక్తులు పాల్గొన్నారు.

